ఘనంగా గోమాత మహోత్సవం


గోమాతకు పూజలు చేస్తున్న ప్రభుదత్త మహారాజ్


రంగనాయక స్వామి ఆలయంలో..

జియాగూడ: జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో గోమాత రక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఆశ్రమం పీఠాధి పతి ప్రభుదత్త మహారాజ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో గోమాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గోమాత ఆలయంలో సుందర కాండ తులసి రామాయణం, గో పూజా, గో సంకీర్తన, గో సేవా, హారతి, అంకుట్ అన్నదానం కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రభుదత్త మహారాజ్ మాట్లాడుతూ..ఆశ్రమం కామదేను గోశాలలో 6 లక్షల గోమాతలు ఉన్నాయని ప్రతిరోజూ 100 టన్నుల గడ్డి అవసరపడుతుందని, గో రక్షణ మహాయజ్ఞంలా కొనసాగిస్తున్నామని తెలిపారు. శంకర్ ప్రభు, ఆదిత్య, నరేందర్ జైస్వాల్ పాల్గొన్నారు.

తిరుపల్లి గడ్డలో..

గోల్కొండ: నానల్‌నగర్ తిరుపల్లి గడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయంలో గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ ప్రతినిధులు సోమారపు జనార్దన్, ఎం.నర్సింహ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. గోమాత, లేగ దూడెలను ఆలయానికి ప్రకాష్ కె.కె. విరాళంగా ఇచ్చారని ఈ సందర్భంగా సోమారపు జనార్దన్ తెలిపారు. దేవాదాయ శాఖ అనుమతితో త్వరలోనే ఆలయంలో గోశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.

ప్రాజెక్టుల రూపకల్పనలో పోటీ పడాలి


ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న విద్యార్థి

లంగర్‌హౌస్: ఇంటర్ డిసిప్లినరీ ఇన్నోవేషన్ కలిగి ఉండి ప్రాజెక్టుల రూపకల్పనలో మెకానిక్ ఇంజినీర్ విద్యార్థులు అంతర్జాతీయ ప్రాజెక్టులతో పోటీ పడాలని 7ఎస్ టెక్నాలజీ సంస్థ సభ్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్, డీఆర్‌డీఎల్‌కు చెందిన డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి అన్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎఫెక్స్ జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో ఇస్రో, డ్రోన్స్ హెచ్‌పీసీడీ, ఎస్‌సీపీటీ, టీబీఐ, ఐబిటీ సంస్థల నుంచి ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా ఉండి విద్యార్థులకు గ్లోబల్ ప్రాజెక్టుల రూపకల్పనలో దిశానిర్దేశాలు చేశారు. దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ రూపకల్పనలతో పోటీపడి ప్రతిభ చూపగా కర్ణాటకకు చెందిన విద్యార్థికి మొదటి బహుమతిగా 500 డాలర్లు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అడ్వెంచర్ థీమ్ పార్కుల రూపకల్పనలో జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు.ప్రపంచంలోని అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు మార్గదర్శక ఇన్నోవేషన్లు తెలిపే విద్యార్థులు, నిపుణులను ప్రోత్సహించడంతో పాటు వారికి సరైన ప్రాముఖ్యత ఇస్తూ బంగారు భవితను చూపడంలో ఎఎస్ఎంఈ ఫౌండేషన్ సంస్థ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మొహమ్మద్ సమీఉద్దీన్, స్వాతి ఆనందం, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గురజారరావు, డాక్టర్ వీకెఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వినియోగదారులకు అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు

నాంపల్లి: సైబర్ సెక్యూరిటీపై ఆదివారం పబ్లిక్‌గార్డెన్స్‌లో వినియోగదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెట్‌వర్క్ జనరల్ మేనేజర్ రవికుమార్ వర్మ హాజరై ప్రసంగించారు. తెలియని ఫోన్ నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వస్తే స్పందించొద్దన్నారు. ఏ ప్రభుత్వ అధికారులు ఫోన్ ద్వారా నిధులను బదిలీ చేయమని వినియోగదారులను అడగరని పేర్కొన్నారు. కావున సైబర్ మోసాలపై వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య వస్తే వెంటనే సమీపంలోని బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వివేక్ జైస్వాల్, డీజీఎం బీపీన్ కుమార్, రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇతర బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గోల్కొండ: ఆలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయాలు, ప్రార్థనా స్థలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్మానాలు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బంజారి దర్వాజా, బడాబజార్ తదితర ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాల్లో పర్యటించారు. మిర్జా ఎక్బాల్ అహ్మద్, సయ్యద్ మజహర్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.


పీస్ కమిటీ సభ్యులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

'దేశంలో బీజేపీకి తిరుగులేదు'


బీజేపీ విజయోత్సవ సంబరాల్లో అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: దేశంలో బీజేపీకి తిరుగులేదని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర ఎన్నికల్లో మరోసారి బీజేపీ విజయం సాధించడం ప్రధాని నరేంద్రమోదీ పాలన దక్షతకు నిదర్శనమన్నారు. రానున్న కాలంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు. తెలంగాణలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ భారీగా అవినీతికి పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, బీజేపీ వివిధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకుట్ పూజలు


అంకుట్ పూజల్లో ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: కార్తీకమాస ఆదివారాన్ని పురస్కరించుకొని హనుమాన్‌టేక్డీలోని అమ్మవారి ఆలయంలో అంకుట్ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేవాదాయశాఖ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అంకుట్ పూజకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశోక్‌యాదవ్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గోల్కొండ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దళారుల వద్దకు వెళ్లకుండా నేరుగా మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను లేదా నేరుగా తనను సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. అనంతరం ఆయన టోలిచౌకీ చౌరస్తా, సెవన్ టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టోలిచౌకీ చౌరస్తా ఫ్లై ఓవర్ కిందిభాగంలో డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయడం పూర్తి అయినా అధికారులు అక్కడ సరైన రోడ్డు వేయలేదని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, సయ్యద్ సిద్దిఖ్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.


రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

ఎటు చూసినా అక్రమ పార్కింగ్

పేరుకుపోతున్న వ్యర్థాలు

కంపు కొడుతున్న పరిసరాలు

మేకల మండీ.. సమస్యలు దండి

జియాగూడ మేకల మండీలో వ్యాపారాలు జోరుగా సాగుతున్నప్పటికీ అంతే స్థాయిలో సమస్యలు వేధిస్తున్నాయి. పార్కింగ్, మేకల విక్రయాలపై టెండర్లు వేసి జీహెచ్ఎంసీ లాభాలు పొందుతున్నప్పటికీ సమస్యలను మాత్రం గాలికి వదిలేసింది. దీంతో వినియోగదారులు, మొండేదారులు, చిరు వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు. మండీ ఎంతో మంది కార్మికులకు జీవనోపాధి అందిస్తున్నప్పటికీ నిత్యం ఇబ్బందులతో సావాసం చేస్తున్నారు. సరైన రోడ్లు లేక దుమ్ము, ధూళి ఎగిసిపడుతోంది. ఎటు చూసినా చెత్తా చెదారమే దర్శనమిస్తోంది. మంగళ, శుక్ర వారాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మేకల లారీల కారణంగా రహదారి పూర్తిగా రద్దీతో నిండిపోతుంది. రోడ్డుపైనే విక్రయాలు, లారీల్లో చనిపోయిన జీవాల కళేబరాలను రోడ్డుపైనే పడేయడంతో దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు జాతీయ రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం పనులు సంవత్సరాల తరబడి కొనసాగడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. సంబంధిత అధికారులు స్పందించి మేకలమండిలో వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – జియాగూడ




రహదారిపై పడేసిన జీవాల కళేబరాలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సబ్జిమండి, డాల్ఫిన్ హోటల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సబ్జిమండి, వాటర్ ట్యాంక్, పోస్ట్ ఆఫీస్, రైస్‌మిల్, సోహెబ్ హోటల్, పటేల్ హోటల్, రంగనాథస్వామి ఆలయం, గోపీ హోటల్, డాల్ఫిన్ హోటల్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కేడీ కాలనీ, కార్వాన్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మొగల్‌కా నాలా, కనకదుర్గా కాలనీ, హర్షద్ మస్జిద్, మొగల్‌నగర్ పిల్లర్ నెం:101 తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మినీ ఓయూ కాలనీ, వెస్టెన్ ప్లాజా ఫీడర్ల పరిధిలోని మినీ ఓయూ కాలనీ, గ్యాస్ గోడౌన్, వెస్టెన్ ప్లాజా, కట్టెల బస్తీ, ముస్లిం బస్తీ, ద్వారకా నగర్, ఓయూ కాలనీ, బిలాల్ మసీద్, షేక్‌పేట్, సక్కుభాయ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో మందుబాబు హల్‌చల్

యాకుత్‌పురా: మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఓ మందుబాబు హల్‌చల్ చేశాడు. ఆదివారం ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్టేషన్‌పరిధిలోని చంపాపేట్ భరత్ గార్డెన్ వద్ద డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. అదే సమయంలో బాలాపూర్ ఎక్స్ రోడ్డుకు చెందిన శివకృష్ణను తనిఖీ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారించి పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేస్తుండగా అడ్డుకుంటూ పోలీసులను ఇబ్బంది పెట్టాడు. దాదాపు 3 గంటల పాటు రోడ్డుపై హంగామా సృష్టించాడు. ఎస్సై అమర్‌నాథ్ రెడ్డి, ఇతర సిబ్బంది అతడికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపిచారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడ్డ మరో 9 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్‌కు పంపారు.

పేకాట స్థావరంపై దాడి

బహదూర్‌పురా: పేకాట స్థావరంపై బహదూర్‌పురా పోలీసులు, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడితో పాటు మరో ఐదు మందిని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం..బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌బాగ్ ప్రాంతంలో మహ్మద్ రఫిక్ మరో ఐదుగురితో కలిసి పేకాట నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బహదూర్‌పురా పోలీసులతో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట నిర్వాహకుడు మహ్మద్ రఫిక్‌తో పాటు మరో ఐదు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.20,930ల నగదు స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పురా పోలీసులకు అప్పగించారు.

వార్షికోత్సవం


సమావేశంలో గ్రాండ్ మాస్టర్ టీఎస్.మనోహరన్ తదితరులు

అబిడ్స్: సామాజిక రంగాల్లో అన్ని వర్గాల ప్రజలకు సేవలందించేందుకు లాడ్జ్ దక్కన్ నెంబర్: 20 నిరంతరం కృషి చేస్తుందని ఆ సంస్థ దక్షిణ భారత ప్రాంతీయ గ్రాండ్ మాస్టర్ టీఎస్.మనోహరన్ పేర్కొన్నారు. గోషామహల్‌లోని సంస్థ కార్యాలయంలో లాడ్జ్‌దక్కన్ నెంబర్:20 వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంవత్సర కాలంగా రూ. 13.94 లక్షల విలువ చేసే పలు రకాల సామగ్రిని లాడ్జ్ దక్కన్ నెంబర్:20 తరపున పేద బడుగు వర్గాల ప్రజలకు అందించడం ఎంతో సంతోషకరమన్నారు. నిలోఫర్ ఆసుపత్రికి రూ.3.9 లక్షల విలువ చేసే బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్‌ను విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఆల పురుషోత్తమ్‌రావు ఐపీఎం ఐ.రమేష్, ఏఆర్ జీఎం ఎం.రమేష్, బ్రదర్ సపన్‌కుమార్ పాండ, ఎల్.హన్మంతరావు, సత్య భూషణ్, సత్యనారాయణ రెడ్డి, చార్టడ్ అకౌంట్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి


సత్కార గ్రహీతలతో గుత్తా సుఖేందర్ రెడ్డి

నాంపల్లి: యువత రాజకీయాల్లోకి రావాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఆదివారం ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో ది మిషన్ సంస్థ 9వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా క్లాసులు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలును సత్కరించారు. అలాగే ది మిషన్ సంస్థ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలియజేసి ప్రసంగించారు. మనం చేసే పని చిన్నదా, పెద్దదా అనేది చూడవద్దని ఆ పని వల్ల నలుగురికి సహాయం అందించగలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీబీఐ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్, లోక్ సత్తా పార్టీ అధ్యక్షుడు జయ ప్రకాష్ నారాయణ, టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

సండే.. సందడి


చార్ కమాన్-చార్మినార్ రోడ్డులో కిక్కిరిసిన సందర్శకులు

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ పరిసర ప్రాంతాలన్నీ పర్యాటనకులతో రద్దీగా మారాయి. చిరు వ్యాపారాలు జోరుగా కొనసాగాయి. నయాపూల్ నుంచి గుల్జార్ హౌజ్ ద్వారా చార్మినార్ వరకు సందర్శకుల సందడి కనిపించింది. బంధుమిత్రులతో కలిసి చార్మినార్, మక్కా మసీద్, చౌమహాల్లా ప్యాలెస్, సాలార్జంగ్ మ్యూజియం, జూ పార్కులను సందర్శించిన వారంతా సరదాగా గడిపారు. సెల్ఫీలు తీసుకుంటూ కాలక్షేపం చేశారు.

కోట కిటకిట..

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు వేలాదిగా కోటకు తరలి వచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం 7:30 గంటలకే కోట గేటు ముందు టికెట్ కోసం బారులు తీరారు. ఇదిలా ఉండగా కోటలోని నగీనాబాగ్, ఆయుధాగారంలో పర్యాటకులు ఎక్కువ సేపు ఉండి ఆనాటి ఆయుధాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు.

బీజేపీ నాయకుడిపై దాడి: కేసు నమోదు


మాట్లాడుతున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రిపై దాడి జరిగింది. ఆయన ఫిర్యాదు మేరకు మీర్ చౌక్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మీర్ చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దారుషిఫాకు చెందిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ శనివారం రాత్రి పురానిహవేలీలోని ఆషుర్ ఖానా వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముగ్గురు తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ విజయంపై సంబరాలు చేస్తుండగా..

మహారాష్ట్రలో బీజేపీ విజయం సందర్భంగా దారుషిఫా, పురాని హవేలీ తదితర ప్రాంతాల్లో సంబరాలు చేస్తుండగా జోహిర్ బిన్ సాబేర్, జాన్ బీన్ సాబేర్, ఫారూఖ్ జలాల్ తనపై దాడికి పాల్పడ్డారని ఆయన తెలిపారు. దీంతో తాను ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొంది మీర్ చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయంలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు సత్కారం



గన్‌ఫౌండ్రీ: సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో విశేషంగా రాణిస్తున్న అమాస అంజలి నృత్యాలయ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ సంఘ సేవకుడు అమృత్‌కుమార్ జైన్, నవభారత్ నిర్మాణ్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విద్యావేత్త సూర్యపల్లి రవికుమార్ నృత్య కళాకారులను సత్కరించి సర్టిఫికెట్లను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ధూల్‌పేట్‌లోని తమ నవభారత్ నిర్మాణ్ సంఘ్ కార్యాలయం తరపున అన్ని రంగాల వారికి బడుగు బలహీన వర్గాల వారికి సమాజ్ శ్రేయస్సుకు నిరంతరం సమాజసేవ అందిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో రేఖ శర్మ, కోమల్‌సోని, సీనియర్ బీజేపీ నేత సంజయ్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివకుమార యాదవ్

జియాగూడ: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం కో కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని 2జే బస్టాప్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ ద్వారా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఇల్లు మారిన వారు, పేర్లు లేని వారు తిరిగి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు ముచింతల సత్యనారాయణ, జియాగూడ బీజేపీ బీసీ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రెయిన్‌బజార్ డివిజన్ ఈస్ట్ చంద్రనగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులు ఆదివారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్ నుంచి నాగాబౌలీ మీదుగా డబీర్‌పురా వరకు రోడ్డు విస్తరణ పనులు, క్రీడా మైదానలు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని ఆయన తెలిపారు.

డాక్టర్ ప్రతాప్ సీతారామయ్యకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బుగరాజు ప్రతాప్ సీతారామయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, ఇతర నాయకులు అశోక్‌కుమార్ ప్రకాష్‌రెడ్డి, సుధీర్‌కుమార్‌లతో పాటు పలువురు నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో నాగేష్, శివకుమార్

లంగర్‌హౌస్: మోకాలి మార్పిడికి అధునాతన శస్త్ర చికిత్స ప్రభావంతమైన విధానమని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రెనోవా ఆస్పత్రి డైరెక్టర్లు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగేష్ అన్నారు.లంగర్‌హౌస్ రెనోవా ఆస్పత్రి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెనోవా అస్పత్రిలో అత్యాధునిక శస్త్ర చికిత్సతో మోకాలి మార్పిడి చేసి నొప్పులకు ఉపశమనం కల్పిస్తున్నామన్నారు. కేవలం లంగర్‌హౌస్ రెనోవా బ్రాంచ్‌లో ప్రస్తుతం తగ్గింపు ధరలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: అక్షద స్కూల్ ఆఫ్ ఫర్ఫామింగ్ ఆఫ్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు నిహాంత్రి రెడ్డి శిష్యురాలు డి.యువన కూచిపూడి నాట్య రంగప్రవేశం ఆదివారం కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో జరిగింది. భామ కళాపం, కృష్ణం కళాయాక్షి, మజె మహిరా పండరి వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నది. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ జి.పద్మజారెడ్డి మాట్లాడుతూ..నేటి యువతరాన్ని శాస్త్రీయ సంగీత నృత్యాల పట్ల ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రహెజా గ్రూఫ్ ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.అరుల్ ప్రకాశం, అమ్రిత కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రాజేష్, కె.శణ్ముగ ప్రియ పాల్గొన్నారు.

సన్మానం


మధిర సత్యనారాయణను సన్మానిస్తున్న మిద్దె కృష్ణ తదితరులు

జియాగూడ: అరుంధతి సేవా మండలి ప్రతి ఏటా సమాజ సేవ చేసిన వారిని గౌరవించడం హర్షణీయమని జియాగూడ ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం చుడిబజార్ అరుంధతి సేవా మండలి (హరిజన సేవక్ మండలి) ఆధ్వర్యంలో ఏర్పాటైన దసరా, దీపావళీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై పలు సంఘాల ప్రతినిధులను సంఘం అధ్యక్షుడు మిద్దె కృష్ణ సన్మానించారు. ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మేందర్, సలహాదారుడు యాదయ్య, కోశాధికారి ఎం.మహేష్‌బాబు, ఎం.గోపాల్, డి.వెంకటేష్, ఎం.చంద్రమోహన్ పాల్గొన్నారు.